సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 27 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను ధర రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికింది. మార్కెట్‌కు 661 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.5

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.5, కనిష్టంగా రూ.2.50, సరాసరిన రూ.3.50 పలికింది.

గరిష్టం/కనిష్టం
39.4°/22.6°

జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు భగీరథ మహర్షి జయంత్యుత్సవం

పుట్టపర్తి అర్బన్: దివి నుంచి గంగను భువికి తెచ్చిన భగీరథ మహర్షి జయంత్యువాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో భగీరథ జయంత్యుత్సవాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పలువురు డీఎస్పీల బదిలీ


వాసుదేవ్


శ్రీలత

కొత్తచెరువు: జిల్లాలోని పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ కసిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కడప 'దిశ'గా డీఎస్పీగా పనిచేస్తున్న వాసుదేవన్ పుట్టపర్తి డీఎస్పీగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న టి.డి.యశ్వంత్‌ను తిరుపతి జిల్లా చంద్రగిరికి బదిలీ చేశారు. కదిరి డీఎస్పీ భవ్యకిశోర్‌ను రేణిగుంటకు బదిలీ చేసి, ఆమె స్థానంలో రాజమండ్రి డీఎస్పీగా ఉన్న శ్రీలతను నియమించారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఉన్న ఉమామహేశ్వర్‌రెడ్డిని జమ్మలమడుగు డీఎస్పీగా బదిలీ చేశారు. ఇక హిందూపురం డీఎస్పీగా వైఎస్సార్ జిల్లా ఏసీబీ విభాగంలో ఉన్న కంజాక్షన్‌ను నియమించారు.

ఉసురు తీసిన ఊయల!


మృతి చెందిన విద్యార్థిని మాధవి

ఓడీచెరువు: చిన్నారిని జోలపుచ్చేందుకు వేసిన ఊయల ఓ బాలిక ఉసురు తీసింది. ఈ సంఘటన మండల పరిధిలోని మద్దకవారిపల్లిలో బుధవారం జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... జనార్దన్, కాంతమ్మ దంపతుల కుమార్తె మాధవి (14) తంగేడుకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. బుధవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన మాధవి ..ఇంట్లో చంటి బిడ్డ కోసం చీరతో వేసిన ఊయలతో ఆడుకుంది. అనంతరం పక్కనే ఉన్న మంచం మీద నుంచి చీరను పట్టుకుని కిందకు దూకింది. ఆ సమయంలో విద్యార్థిని మెడకు చీర చుట్టుకుపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో చిన్నారి ఊపిరి ఆగిపోయింది. కొంతసేపటికి ఇంటి బయట ఉన్న కుటుంబ సభ్యులు లోపలికి వచ్చి మాధవిని కిందకు దింపి చూడగా, అప్పటికే ప్రాణాలు కోల్పోయింది.

ముగిసిన పది మూల్యాంకనం



ప్రశాంతి నిలయం: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ జిల్లాలో బుధవారం పూర్తయ్యింది. కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఈనెల 19న మూల్యాంకం ప్రారంభం కాగా, 950 మంది సిబ్బంది పాల్గొన్నారు. 8 రోజుల పాటు జిల్లాకు వచ్చిన 1,85,546 జవాబు పత్రాలను దిద్దారు. మూల్యాంకనం సజావుగా సాగేందుకు సహకరించిన సిబ్బందికి డీఈఓ మీనాక్షి అభినందనలు తెలిపారు.

ధర్మవరంలో హెబ్బా పటేల్


ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డితో కలిసి ఓ ప్రైవేటు కార్యక్రమంలో హెబ్బా పటేల్

కుమారి 21ఎఫ్‌తో యూత్‌లో మాంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న హీరోయిన్ హెబ్బా పటేల్ ధర్మవరంలో సందడి చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డితో కలిసి ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' అన్నట్లు ఓ లుక్కివ్వడంతో యువత మైమరిపోయారు. ఆమెతో సెల్ఫీలు, ఫొటోల కోసం ప్రయత్నించగా, వారిని కంట్రోల్ చేసేందుకు సెక్యూరిటీ సిబ్బంది నానా తంటాలు పడ్డారు.

– ధర్మవరం అర్బన్

నార్పలలో 'జగనన్న వసతి దీవెన' బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



నీరాజనం

- అన్ని దారులూ నార్పల వైపే
- మిన్నంటిన 'జై జగన్' నినాదాలు
- సీఎం ప్రసంగం ఆద్యంతం చప్పట్ల హోరు

అనంతపురం: శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రం వేదికగా బుధవారం 'జగనన్న వసతి దీవెన' సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమం విజయవంతమైంది. సీఎం హోదాలో మొదటిసారి విచ్చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విశేష ప్రజాదరణ లభించింది. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మహిళా సంఘాల సభ్యులు, శింగనమల, నార్పల, యల్లనూరు, పుట్లూరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల నుంచే కాకుండా అన్ని నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అన్ని దారులూ నార్పలవైపే సాగాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే జనం సభా వేదిక వద్దకు చేరుకోవడం మొదలైంది. 10 గంటలకల్లా గ్యాలరీలు నిండిపోయాయి. సభా ప్రాంగణం బయట మూడింతల జనం నిల్చుండిపోయారు. అధికారులు సీఎం ప్రసంగం కోసం ఎల్‌ఈడీ టీవీలు ఏర్పాటు చేశారు.

హోరెత్తిన నినాదాలు

నార్పల పరిసరాలు 'జై జగన్' నినాదాలతో మిన్నంటాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి ఎయిర్‌పోర్టు నుంచి నార్పలకు హెలికాప్టర్‌లో వచ్చారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, కలెక్టర్ ఎం.గౌతమి, డీఐజీ ఆర్.ఎస్.అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాస రావు, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, సహాయ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట హెలికాప్టర్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వచ్చారు. సభావేదిక మీద ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి సీఎం నివాళులర్పించి సభను ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం సీఎం జగన్‌ను ఎమ్మెల్యే పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. సీఎం పర్యటన విజయవంతంగా ముగియడం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది.

కరుణించిన వరుణుడు

బహిరంగ సభ ప్రారంభానికి రెండు గంటల ముందు వరుణ దేవుడు కరుణించాడు. ఓ మోస్తరు వర్షం పడడంతో పరిసర ప్రాంతాలు చల్లగా మారాయి. సీఎం జగన్ ఎక్కడ సమావేశం పెట్టినా... వరుణ దేవుడు వచ్చి పలుకరించి వెళ్తాడనడానికి నార్పల బహిరంగ సభే నిదర్శనం. జనం సీఎం ప్రసంగం ఆసాంతం కదలకుండా విన్నారు. ప్రసంగం ఆద్యంతం ఈలలు, చప్పట్లతో హోరెత్తింది. పంచతంత్రం కథ ఆకట్టుకునేలా చెప్పడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. సీఎం ..సీఎం అంటూ నినాదాలు చేశారు. థ్యాంక్యూ మామయ్య అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. సభకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ వాటర్ బాటిల్, స్నాక్స్, జ్యూస్ అందించారు. అలాగే అనంతపురం, బత్తలపల్లి, తాడిపత్రి, నార్పల వైపు వెళ్లే రోడ్లలో ప్రతి 50 అడుగుల దూరంలో వాటర్ ప్యాకెట్లు అందించారు.

ఆత్మీయ వీడ్కోలు

జగనన్న వసతి దీవెన కార్యక్రమం ముగించుకున్న తర్వాత బుధవారం మధ్యాహ్నం నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ఆత్మీయ వీడ్కోలు లభించింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు ప్రతి ఒక్కరి నుంచి పూల బొకేలు స్వీకరిస్తూ ఆప్యాయంగా పలకరించారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారందరితోనూ దాదాపు గంటన్నరపాటు సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా 23 మంది తమ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రాలు అందజేశారు. వీరిలో 19 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారు. కలెక్టర్ గౌతమిని పిలిపించి ముగ్గురి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వారందరి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- వేదిక మీద జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, కేవీ ఉషశ్రీ చరణ్, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, పోతుల సునీత, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్/ఎమ్మెల్సీ తలశిల రఘురాం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, నార్పల సర్పంచ్ సుప్రియ, జెడ్పీవైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, అనంతపురం మేయర్ మహమ్మద్ వసీం, రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్, ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి, జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన, అనంతపురం ఆర్డీఓ మధుసూదన్, కళ్యాణదుర్గం ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ ఎమ్మెల్సీ శమంతమణి తదితరులు ఆశీనులయ్యారు.

శింగనమల నియోజకవర్గానికి వరాల జల్లు

అనంతపురం/శింగనమల/ నార్పల: శింగనమల నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నియోజకవర్గ అభివృద్ధి పనుల గురించి విన్నవించగా సీఎం వెంటనే ఆమోదం తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.

- చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామాలైన ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.168 కోట్లు మంజూరు.
- ఈస్ట్ నరసాపురంలో బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.35 కోట్ల కేటాయింపునకు ఆమోదం.
- శింగనమల మండల కేంద్రంలో రూ.2 కోట్ల నిధులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి ఆమోదం.
- మిడ్‌పెన్నార్ డ్యాం నిర్వహణ నిమిత్తం రూ.3 కోట్ల నిధులు విడుదల.
- నార్పల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 800 మంది విద్యార్థినులు ఉన్నారు. పాఠశాల నిర్వహణకు రెండు ఎకరాలు కావాలని కోరగా, ఇందుకు కోటి రూపాయల నిధులు కేటాయిస్తూ సీఎం ఆమోదం.
- చిత్రావతి నది మీద యల్లనూరు మండలంలో కేడీ రోడ్డు నుంచి చింతకాయమందకు రాకపోకల నిమిత్తం రూ.11.75 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం.
- చిత్రావతి నది మీద కోడుమూర్తి నుంచి చిలమకూరు వరకు రూ.15 కోట్ల వ్యయంతో కాజ్‌వే నిర్మాణానికి అంగీకారం.
- పుట్లూరు, యల్లనూరు మండలాల ప్రజలు పులివెందుల నియోజకవర్గానికి ఆనుకుని ఉండడం వల్ల పులివెందులను కూడా తమ సొంత నియోజకవర్గంలా భావిస్తుంటారు. పుట్లూరు మండలంలో సాగు, తాగునీరు సమస్యను పరిష్కరించడానికి గండికోట రిజర్వాయర్ నుంచి సుబ్బరాయసాగర్ ట్యాంక్‌కు లిఫ్ట్ ద్వారా నీరందించే పథకానికి రూ.250 కోట్లు మంజూరు.

ఉన్నత విద్యావంతులను చేయడమే లక్ష్యం

ఉన్నత విద్య అభ్యసిస్తున్న ఎంతోమంది పేద విద్యార్థులకు భోజన, వసతి భారం తల్లిదండ్రుల మీద పడకుండా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ 'జగనన్న వసతి దీవెన' ద్వారా అందజేస్తున్నారని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. నార్పలలో నిర్వహించిన వసతి దీవెన కార్యక్రమం బహిరంగ సభను కలెక్టర్ స్వాగతోపన్యాసం చేశారు. ఐటీఐ నుంచి పీహెచ్‌డీ వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీ, విభిన్న ప్రతిభావంతులు వసతి దీవెన పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,55,662 మంది పేద విద్యార్థులకు రూ.912.71 కోట్లు వారి తల్లుల ఖాతాల్లో జమ కానుందన్నారు. అనంతపురం జిల్లాకు చెందిన 40 వేల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.39.92 కోట్లను వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ఇలాంటి పథకాలు లేకనిన్న, మొన్నటి తరానికి చెందిన పేదలు ఉన్నత చదువులకు దూరం అయ్యారని పేర్కొన్నారు.



జగనన్న వసతి దీవెన సొమ్మును బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


జగనన్న విద్యారత్నాలు పేరిట జ్ఞాపికను సీఎం జగన్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

ముఖ్యమంత్రి పర్యటన సాగిందిలా..

- **ఉదయం 10** గంటలకు సీఎం జగన్ శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.
- **ఉదయం 10:30** గంటల వరకు శ్రీసత్యసాయి జిల్లా ఎమ్మెల్యేలతో మాట్లాడారు.
- **ఉదయం 10:50** గంటలకు నార్పల ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.
- **ఉదయం 10:50 నుంచి 11:20** గంటల వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడారు.
- **ఉదయం 11:25కు** నార్పల క్రాస్‌వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి రోడ్డు మార్గంలో చేరుకున్నారు.
- **ఉదయం 11:30కు** ఫొటో గ్యాలరీని తిలకించారు. అక్కడే ఉన్న విద్యార్థులతో సరదాగా ముచ్చటించి గ్రూపు ఫొటో తీసుకున్నారు.
- **ఉదయం 11:40కు** వేదికపై వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- **ఉదయం 11:45కు** కలెక్టర్ ఎం.గౌతమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు.
- **ఉదయం 11:50కు** శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రసంగించారు.
- **మధ్యాహ్నం 12** గంటలకు విద్యార్థులతో మాటామంతి.
- **మధ్యాహ్నం 12:20కు** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ప్రారంభం.
- **మధ్యాహ్నం 1:10కు** జగనన్న వసతి దీవెన పథకం నిధులను బటన్ నొక్కి నేరుగా తల్లుల ఖాతాల్లో జమ.
- **మధ్యాహ్నం 1:15కు** సీఎం జగన్‌కు సత్కారం.
- **మధ్యాహ్నం 1:25కు** బహిరంగసభ ముగింపు.
- **మధ్యాహ్నం 3:45** వరకు ఎమ్మెల్యేల తో సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరి నుంచి పూల బొకేలు, వినతిపత్రాలు స్వీకరించారు.
- **సాయంత్రం 4గంటలకు** సాంకేతిక లోపం కారణంగా హెలికాప్టర్ మొరాయించడంతో రోడ్డుమార్గాన పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు.
- రోడ్డు మార్గాన వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు పూల వర్షం కురిపించారు.


నార్పల మండల కేంద్రంలో సీఎం వైఎస్ జగన్‌ను చూసి అభివాదం చేస్తున్న ప్రజలు



వసతిదీవెన సొమ్ము విడుదల సందర్భంగా విజిల్స్ వేస్తున్న విద్యార్థినులు


బహిరంగసభకు జై జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ వస్తున్న విద్యార్థులు

ఇంటర్‌లో బాలికలదే హవా

- ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదల
- ఉమ్మడి జిల్లాకు జూనియర్ ఇంటర్‌లో 7, సీనియర్ ఇంటర్‌లో 9వ స్థానం



రాప్తాడు రూరల్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. బుధవారం సాయంత్రం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఫలితాలను విడుదల చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానం గతేడాదికంటే మెరుగుపడింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో 7వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 9వ స్థానాన్ని దక్కించుకుంది.

జూనియర్ ఇంటర్‌లో 57 శాతం ఉత్తీర్ణత..

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి జిల్లా 57 శాతం ఉత్తీర్ణత సాధించింది. గతేడాది 46 శాతానికి సరిపెట్టుకోగా ఈసారి 11 శాతం పెరిగింది. మొత్తం 25,249 మంది విద్యార్థులకు గాను 14,504 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 11,566 మంది బాలురకు గాను 6,061 మంది (52 శాతం), 13,683 మంది బాలికలకు గాను 8,443 మంది (62 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

చిలమత్తూరు ఫస్ట్... బెళుగుప్ప లాస్ట్..

ఇంటర్ మొదటి సంవత్సరం (జనరల్) ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చిలమత్తూరు కళాశాల టాప్‌లో నిలవగా బెళుగుప్ప కళాశాల లాస్ట్‌లో నిలిచింది. చిలమత్తూరు కళాశాలలో 40 మందికి గాను 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రెండో స్థానంలో రామగిరి , మూడోస్థానంలో బొమ్మనహాళ్ జూనియర్ కళాశాల నిలిచాయి. బెళుగుప్ప కళాశాలలో 15 మందికి గాను ఒక్కరు ఉత్తీర్ణత సాధించడంతో చివరిస్థానంలో నిలిచింది.

సీనియర్ ఇంటర్‌లో 67 శాతం ఉత్తీర్ణత..

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లోనూ గతేడాదికంటే మెరుగైంది. గతేడాది 55 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 67 శాతానికి చేరుకుంది. మొత్తం 25,126 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 16,943 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 11,609 మంది బాలురకు గాను 7,278 మంది (63 శాతం), 13,519 మంది బాలికలకు గాను 9,665 మంది (72 శాతం) పాసయ్యారు.

బొమ్మనహాళ్ జూనియర్ కళాశాల టాప్

ద్వితీయ సంవత్సరం (జనరల్) ఫలితాల్లో బొమ్మనహాళ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల టాప్‌లో నిలిచింది. 196 మంది విద్యార్థులకు గాను 160 మంది పాసయ్యారు. మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. 116 మంది విద్యార్థులకు గాను 79 మంది ఉత్తీర్ణత సాధించారు. రామగిరి జూనియర్ కళాశాల మూడో స్థానంలో నిలిచింది. చివరి స్థానాల్లో బెళుగుప్ప, ముదిరెడ్డిపల్లి కళాశాలలు నిలిచాయి.

పచ్చ పాపం.. తుంపర్తి రైతులకు శాపం

- నాడు బలవంతంగా రైతుల నుంచి 210 ఎకరాల సేకరణ
- ఎకరాకు రూ.5 లక్షల పరిహారం కోర్టులో జమ చేసిన టీడీపీ సర్కార్
- వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మెరుగైన పరిహారానికి చర్యలు
- రైతుల ముసుగులో సీఎం కాన్వాయ్‌కి అడ్డునిలిచిన టీడీపీ నేతలు

ధర్మవరం రూరల్: నాడు రైతులకు అన్యాయం చేసిన వారే.. నేడు గగ్గోలు పెడుతున్నారు. నాటి 'పచ్చ' పాపాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టేసి లబ్ధి పొందేందుకు నికృష్ట రాజకీయానికి తెరతీశారు. ధర్మవరం మండలంలోని తుంపర్తి రైతులను అడ్డు పెట్టి టీడీపీ నేతలు ఆడుతున్న కపట నాటకాన్ని చూసి జనం అసహ్యించుకుంటున్నారు.

ఎకరాకు రూ.5 లక్షలతో సరిపెట్టి..

టీడీపీ హయాంలో నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు 2017లో తుంపర్తికి చెందిన 57 మంది రైతులకు చెందిన 210 ఎకరాలను సేకరించారు. తొలుత ఎకరానికి రూ.2 లక్షల పరిహారం ఇస్తామని అప్పటి ఎమ్మెల్యే వరదాపురం సూరి చెప్పగా రైతులు ఒప్పుకోలేదు. ఎకరం రూ.10 లక్షలు చేసే భూములకు అంత తక్కువ ఇస్తే తాము ఊరుకోబోమని ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే కొందరు రైతులు తమకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారు. ఎన్నికలు సమీపించగా టీడీపీ ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్సే వరదాపురం సూరి సూచన మేరకు ఎకరానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేసి ఆ మొత్తాన్ని కోర్టులో డిపాజిట్ చేసింది. దీంతో భూ నిర్వాసితుల్లోని 40 మంది పరిహారం తీసుకోగా, మరో 17 మంది మాత్రం నేటికీ పరిహారం తీసుకోలేదు. తమకు మెరుగైన పరిహారం ఇప్పించాలని కోర్టులోనే కేసు నడిపిస్తున్నారు. తుంపర్తి రైతుల ఆందోళనకు అప్పట్లోనే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అండగా నిలిచారు. వారితో కలిసి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

సమస్య కోర్టు పరిధిలో ఉండటంతో...

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక తుంపర్తి రైతుల సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రయత్నించారు. ప్రభుత్వం తరపున రైతుకు మెరుగైన పరిహారంతో పాటు భూమిని కోల్పోయిన ప్రతి రైతుకు 5 సెంట్లు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టారు. అయితే టీడీపీ సర్కార్ పరిహారం ఖరారు చేసి కోర్టులో జమ చేసినందున ఇప్పటి ప్రభుత్వం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండిపోయింది. దీంతో ఎమ్మెల్యే రైతుకు న్యాయం చేసే మార్గాలను అన్వేషిస్తున్నారు.

ఈ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకు...

అధికారంలో ఉండగా రైతులకు మేలు చేయలేని టీడీపీ నేతలు...వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక నాటకానికి తెరతీశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నెపం నెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారు. ఈ క్రమంలోనే గత కొద్ది రోజులుగా టీడీపీ నాయకులు రైతులను రెచ్చగొట్టి ప్రభుత్వంపై ఉసిగొల్పుతున్నారు. అందులో భాగంగానే బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నార్పల నుంచి రోడ్డు మార్గాన వస్తున్నట్లు తెలుసుకున్న టీడీపీ నాయకులు రైతుల ముసుగులో కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. టీడీపీ హయాంలో జరిగిన భూ సేకరణ అంశాన్ని ఇప్పుడు తెరపైకి తెచ్చి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే తమను మోసం చేసినట్లుగా చిత్రీకరించడం చూసి స్థానికులు అసహ్యించుకున్నారు.

క్లుప్తంగా

ముస్లిం వ్యతిరేకి చంద్రబాబును బహిష్కరించండి

- సాదత్ కౌన్సిల్ ఛైర్మన్ నూర్‌బాబా పిలుపు



పెనుకొండ: ముస్లింల అభ్యున్నతిని వ్యతిరేకించే చంద్రబాబును రాజకీయంగా అన్ని మతాల ప్రజలు బహిష్కరించాలని ఏపీ సయ్యాదత్ సాదత్ కౌన్సిల్ ఛైర్మన్ కేఎస్ ఎస్‌బీ నూర్‌బాబా పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... దేశంలో సోదరభావంతో మెలుగుతున్న హిందూ, ముస్లిం, క్రైస్తవుల మధ్య చిచ్చు రేపుతున్న కేంద్రంలోని బీజేపీతో చంద్రబాబు పొత్తు కోసం పాకులాడడంపై మండిపడ్డారు. ముస్లింలకు అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్లను తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎత్తి వేస్తామంటూ చంద్రబాబు పేర్కొనడం దారుణమన్నారు. ప్రధాని మోదీని ప్రసన్నం చేసుకునేందుకు ఇలాంటి చవకబారు ఎత్తుగడలు వేస్తే ప్రజలు హర్షించరనే విషయాన్ని గుర్తించాలని హితవు పలికారు. రాజకీయంగా పతనావస్థలో ఉన్న చంద్రబాబుకు రాబోవు ఎన్నికల్లో భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇంటర్ ఫలితాల్లో 'బెస్ట్' సత్తా



భార్గవి

రాప్తాడు రూరల్ : అనంతపురం నగర శివారులోని వడియంపేట వద్ద ఉన్న బెస్ట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటారు. ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఇందులో కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థినులు బి.ప్రణవిక 1000 మార్కులకు 984, సి. భార్గవి 967 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. అలాగే, సీఈసీలో సమీరా 1000కి 910, ఎంఈసీలో స్రవంతి 896, బైపీసీలో అజయ్ 946, ఎమ్. మధురిమ 932 మార్కులతో సత్తా చాటారు. విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

క్రీడా కోచ్‌లకు నోటీసులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలో ఫెన్సింగ్ క్రీడకు సంబంధించి ఖేలో ఇండియా కోచ్ రవీంద్ర, డీఎస్‌ఏ కోచ్ ప్రతాప్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఈ మేరకు జిల్లా చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి బుధవారం తెలిపారు.

జననేతకు ఘన స్వాగతం





సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బత్తలపల్లి కూడలిలో సీఎం వైఎస్ జగన్ ప్రయాణిస్తున్న కారును కప్పేసిన పూలు

- శాలువాలు, పూలబొకేలతో సన్మానించిన ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుట్టపర్తి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గన్నవరం విమానాశ్రయం నుంచి నేరుగా ప్రత్యేక విమానంలో ఆయన బుధవారం ఉదయం 10.05 గంటలకు పుట్టపర్తికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తిప్పేస్వామి, సిద్ధారెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌కుమార్ , జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకరరాజు, పుడా చైర్మన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, ఎంపీపీ రమణారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతిధులు, స్థానిక నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. సీఎంకు నంది విగ్రహాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు అందజేశారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన అనంతపురం జిల్లా నార్పలకు వెళ్లారు. తిరిగి రోడ్డు మార్గంలో బత్తలపల్లి, ధర్మవరం, కొత్తచెరువు మీదుగా సాయంత్రం 4.45 గంటలకు సత్యసాయి విమానాశ్రయాన్ని చేరుకున్నారు. 5.00 గంటలకు.ముఖ్యమంత్రితో పాటు మంత్రి బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున ప్రత్యేక విమానంలో గన్నవరానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారికి వీడ్కోలు పలికిన వారిలో ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు అరుణ్‌బాబు, గౌతమి, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీలు మాధవరెడ్డి, శ్రీనివాసరావు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు ఆర్‌జే రత్నాకర్, రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సీఎం వాహనాన్ని పూలతో ముంచెత్తిన ప్రజలు

బత్తలపల్లి: నార్పలలో కార్యక్రమాన్ని ముగించుకుని రోడ్డు మార్గాన పుట్టపర్తి విమానాశ్రయానికి బయలుదేరిన సీఎం వైఎస్ జగన్ కాన్వాయ్ బత్తలపల్లి కూడలికి చేరుకోగానే ప్రజలు పూలతో ముంచెత్తారు. శివాలయం నుంచి కూడలి వరకూ అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మండలంలోని మాల్యవంతం, బత్తలపల్లి, పోట్లమర్రి గ్రామాల్లో ప్రజలు రోడ్డుపైకి చేరుకుని జై జగన్ అంటూ నినాదాలు చేశారు.



సీఎం వైఎస్ జగన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



స్వాగతం పలుకుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్, జేసీ చేతన్



పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



బొకే అందజేస్తున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



స్వాగతిస్తున్న ధర్మవరం, తాడిపత్రి ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి



శాలువ కప్పి అభివాదం చేస్తున్న మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి



బొకే అందజేస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ



రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



బొకే అందజేస్తున్న సత్యసాయి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకరరాజు

తల్లీకుమార్తె ఆత్మహత్య



బావిలో తేలుతున్న తల్లి, కుమార్తె మృతదేహాలు (ఫైల్)

పావగడ: జీవితంపై విరక్తి పెంచుకున్న ఓ వివాహిత తన కుమార్తెతో సహ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... తిరుమణి పోలీసు స్టేషన్ పరిధిలోని క్యాతగానకెరె గ్రామానికి చెందిన కురుబ రాఘవేంద్ర, చౌడక్క (32) దంపతులు. వీరికి ఒక్కానొక్క కుమార్తె రక్షిత (10) ఉంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 20వ తేదీ సాయంత్రం తన కుమార్తెను పిలుచుకుని చౌడక్క ఇల్లు విడిచి వెళ్లింది. అదే రోజు గ్రామ శివారులోని బావిలోకి తొలుత కుమార్తెను తోసి, తర్వాత తాను కూడా దూకింది. ఈత రాక పోవడంతో ఇద్దరూ నీట మునిగి మృతి చెందారు. ఈ నెల 22న ఇద్దరి మృతదేహాలు నీటిలో తేలాడుతుండడంతో గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న తిరుమణి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఘటనపై మృతురాలు చౌడక్క తండ్రి ఈరణ్ణ మాట్లాడుతూ.. తన కుమార్తె, మనుమరాలు ఆత్మహత్యలకు అల్లుడు రాఘవేంద్ర కారణమని ఆరోపించారు. మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ జులాయిగా మారాడని మండిపడ్డారు. దీంతో కుటుంబ పోషణ భారమై జీవితంపై విరక్తితో తన కుమార్తె.. మనవరాలితో సహ ఆత్మహత్యకు పాల్పడినట్లుగా ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో రాఘవేంద్రను బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

అమరాపురం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అమరాపురం మండలం మద్దనకుంటకు చెందిన పాండురంగప్ప (73), సరోజమ్మ దంపతులు. వారం రోజుల క్రితం కుమారుడితో కలసి భార్య బెంగళూరుకు వెళ్లింది. దీంతో ఒంటరిగా జీవిస్తున్న పాండురంగప్ప గ్రామ శివారులోని చెరువు వద్దకు మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి ఊపిరాడక మృతి చెందాడు. సాయంత్రమైన పాండురంగప్ప జాడ లేక పోవడంతో చుట్టుపక్కల వారు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం సాయంత్రం చెరువులో మృతదేహం తేలడంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీసి, కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు బెంగళూరు హుటాహుటిన తరలి వచ్చారు. పాండురంగప్ప మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతుడి భార్య సరోజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



ప్రవీణ్ (ఫైల్)

కొత్తచెరువు: వ్యక్తిగత పనిపై ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి... వడదెబ్బకు గురై మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మీదేవమ్మ తెలిపిన మేరకు... అవివాహితుడైన తన కుమారుడు ప్రవీణ్ (43) బుధవారం ఉదయం పనిపై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం తర్వాత కాలినడకన ఇంటికి చేరుకోగానే నీరసంతో కుప్పకూలిపోయాడు. అపస్మారకంగా పడి ఉన్న కుమారుడిని చుట్టుపక్కల వారి సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా... అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతికి వడదెబ్బనే కారణంగా పేర్కొన్నట్లు సమాచారం.

పట్టపగలే చోరీ

కదిరి టౌన్: పట్టపగలే ఓ ఇంట్లో ఓ దుండగుడు చొరబడి విలువైన బంగారు నగలు, నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరిలోని బండారు నగర్‌లో నివాసముంటున్న చిన్నారెడ్డి దంపతులు డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం చిన్నారెడ్డి భార్య ధర్మవరానికి వెళ్లింది. ఉదయం 10.15 గంటలకు ఇంటికి తాళం వేసి, చిన్నారెడ్డి క్లినిక్‌కు వెళ్లాడు. విషయాన్ని గమనించిన దుండగుడు ఇంటి తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 35 తులాల బంగారు నగలు, రూ.1.60 లక్షల నగదు అపహించుకెళ్లారు. మధ్యాహ్నం భోజన సమయంలో ఇంటికి వచ్చిన దంపతులు చోరీ విషయం గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలాన్ని పట్టణ సీఐ మధు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

తమలపాకు తోట నరికివేత

రొళ్ల: మండలంలోని ఎల్‌కేపల్లి వడ్రహట్టి గ్రామానికి చెందిన రైతు యల్లప్ప సాగు చేసిన తమలపాకు తోటను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. బాధితుడు తెలిపిన మేరకు... తనకున్న పొలంలో 400 వక్క చెట్లను సాగు చేసిన రైతు.. అంతరపంటగా తమలపాకు సాగు చేపట్టాడు. ఏటా తమలపాకు పంట ద్వారా రూ.లక్ష వరకు ఆదాయాన్ని గడిస్తున్నాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తోటలోకి ప్రవేశించి 400 వక్క చెట్లకు అంటు రూపంలో కట్టిన తమలపాకు తోటను పూర్తిగా నరికివేశారు. ఉద్దేశపూర్వకంగానే తమలపాకు తోటను నరికివేశారని, తిరిగి తమలపాకు తోటను పెంచాలంటే రెండేళ్ల సమయం పడుతుందని రైతు వాపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



అంజినరెడ్డిని సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

హిందూపురం టౌన్: సచివాలయ వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు కల్పించి లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాము ఎల్లప్పుడు రుణపడి ఉంటామని సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమిరెడ్డి అంజినరెడ్డి అన్నారు. బుధవారం హిందూపురంలో నిర్వహించిన సచివాలయ ఉద్యోగులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రొబేషనరీ పూర్తి చేసుకున్న సచివాలయ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకారం జీతాలు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎనుకున్నారు. జిల్లా అసోయేషన్ అధ్యక్షుడిగా బి.జయప్రసాద్‌రెడ్డి, హిందూపురం అర్బన్ నూతన అధ్యక్షుడిగా కె.హరినాథ్, హిందూపూర్ అర్బన్ ఉమెన్ వింగ్ అధ్యక్షురాలిగా కవితరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అర్బన్ జనరల్ సెక్రెటరీగా శరణ్, ట్రెజరర్‌గా రమేష్, అదనపు జనరల్ సెక్రెటరీగా చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ప్రవీణ్, ధీరజ్, బాబూప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లుగా శ్రీకాంత్, ఆలం వలిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఇన్‌చార్జ్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి భవితకు బాటలు

- పేదల చదువుకు సీఎం జగన్ భరోసా ఇస్తున్నారు
- 'జగనన్న వసతి దీవెన' ప్రారంభోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు
- జిల్లాలోని 35 వేల మంది తల్లుల ఖాతాల్లో రూ.33.68 కోట్లు జమ



మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఆర్థిక ఇబ్బందులతో ఏ పేద విద్యార్థి చదువు ఆగకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాలు అమలు చేస్తూ వారి భవితకు బాటలు వేస్తున్నారని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. బుధవారం అనంతపురం జిల్లా నార్పలలో జరిగిన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్‌నొక్కి 'జగనన్న వసతి దీవెన' నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఆర్డీఓ భాగ్యరేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జిల్లాలోని లబ్ధిదారులకు జగనన్న వసతి దీవెన మెగా చెక్కు అందజేశారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, ఉన్నత చదవులు అభ్యసిస్తున్న పేద విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనన ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పేరుతో మొత్తం ఫీజు రీయింబర్స్ చేస్తోందన్నారు. అలాగే వసతి, భోజన ఖర్చుల కోసం వసతి దీవెన పేరుతో ఏటా రెండు వాయిదాల్లో ఆర్థిక సాయం అందజేస్తూ అండుకుంటోందన్నారు. ఇందులో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ.20 వేలు అందజేస్తూ పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలబడుతున్నారన్నారు. ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

నాడు అరకొర.. నేడు అడిగినంత..

జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పుడా చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ, టీడీపీ హయాంలో ఉన్నత చదువులు అభ్యసించాలంటే నిరుపేద కుటుంబాల విద్యార్థులు భయపడేవారన్నారు. అరకొర ఫీజురీయంబర్స్‌మెంట్ చెల్లించడంతో చాలా మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసి చిన్న చిన్న పనులు చేసుకుంటూ బతుకుతున్నారన్నారు. కానీ సీఎం జగనన్న విద్యారంగానికి అడినన్ని నిధులు కేటాయిస్తూ విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేస్తున్నారన్నారు. కేవలం నాలుగేళ్లలోనే విద్య కోసం రాష్ట్రంలో రూ.59 వేల కోట్లు ఖర్చు చేశారని, బహుశా దేశంలోనే ఇలాంటి ముఖ్యమంత్రి ఎక్కడా ఉండరన్నారు. 'జగనన్న వసతి దీవెన'కు 35,080 మంది విద్యార్థులు అర్హత సాధించగా, వారి తల్లుల ఖాతాలో రూ.33.68 కోట్లు జమ చేశామన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలాజ్యోతి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ మోహన్‌రామ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మా దేవుడు జగనన్న



ఏదైనా కష్టం వస్తే అందరూ దేవున్ని వేడుకుంటారు. మేము అడగకపోయినా మా కష్టాలు గుర్తించి మాకు ఆర్థికంగా అండనిస్తూ మా భవితకు బాటలు వేస్తున్న సీఎం జగనన్న మాకు దేవుడే. ఆయన విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. ప్రతి పేద విద్యార్థికీ ఉన్నత చదువు చెప్పించాలని ఉన్నతమైన ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. ఆయన చేసిన మేలు జీవితంలో మరువలేం. – మౌనిక, డైట్ కళాశాల విద్యార్థి

సద్వినియోగం చేసుకుంటాం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా చదువుల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి జీవితంలో స్థిరపడతాం. తర్వాత మాలాంటి విద్యార్థులకు అండగా నిలుస్తాం. జగనన్న 'అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో పేద కుటుంబాల్లోని విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారు. ఇలాంటి సీఎంను ఇప్పటి వరకూ చూడలేదు. – ప్రియాంక, టీటీసీ విద్యార్థి